# ఐ. సి. యస్.

★

శ్రీ మంచళ్ల సుదర్శనాచార్యులు

మా రెండవ అమ్మాయి పెండ్లికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నెల రోజులు సెలవుపెట్టి నేను గుంటూరులో ఏర్పాట్లన్నీ చేయించుతున్నాను. పుట్టి పెరిగి చదువుకొన్నది అక్కడే కాబట్టి బాల్యస్నేహితులెందరో ఉన్నారు గుంటూరులో. వాళ్ళందరిని ఆహ్వానించాను. వంటవసతి లోపములేకుండా సాగిపోవడానికి, వంట మనిషి నొకని ఏర్పాటు చేద్దామనుకున్నాము. ఆ విషయము సుందరరావుతో చెప్పాను.

మరుసటిరోజుప్రొద్దున 10 గంటలకు మా కృష్ణుడొక విజిటింగుకార్డు తీసికొని ఇచ్చాడు. దానిమీద 'T. Venkatesan I. C. S.' అని ఉంది. నిజంగా నాకు చాలా ఆశ్చర్యము, గాభరా కలిగింది. నా స్నేహితబృందంలో I. C. S. చదివినవాడెవడూలేడు. ఇక యీ వెంకటేశన్‌గారెవరు? ఎవరైనాసరే, వచ్చినవారిని ఆహ్వానించి మాట్లాడకపోతే అగౌరవంగా ఉంటుందనుకొని త్వరగా డాబుగా కనపడేటట్లు దుస్తులువేసుకొని వరండాలోనికి వచ్చాను. అప్పటికే ఆ ఐ. సి. యస్. టీకుగా కుర్చీలో ఉన్నాడు. నన్ను చూడంగానే లేద్దామావద్దా అనే సందేహంలోపడి, చివఱకులేచి చేతులు రెండూముడిచాడు. పునః నమస్కారమంటూ మఱొక కుర్చీలో కూర్చొన్నాను. నాతో ఏమిపనిజరుగవలసిందో సెలవియ్యండి అని గౌరవంతో అడిగాను. "మీరే అడుగుతారేమండి పిలిపించి? దేనికి రమ్మన్నారో మీకుతెలియదంటే ఎట్లా? మీ స్నేహితులు సుందరరావుగారు నన్ను మీ వద్దకువెళ్ళమన్నారు. కనుక వచ్చాను" అన్నాడు. వంటమనిషిని కుదుర్చుమన్నా కాని. ఐ. సి. యస్ ఆఫీసరును పిలువుమన లేదే అని దీర్ఘాలోచనలో పడ్డాను. నా అవస్థ వెంకటేశన్‌గారు 'గమనించారనే అనుకుంటాను. హమేతుమే తేల్చుదామని 'మీరెక్కడ పని చేస్తున్నారు? ఏమనిచెప్పి సుందరరావుగారు మిమ్ములను నావద్దకుపంపించారు? అన్నా దర్జాగా మందహాసంచేస్తూ, 'మీ కొక పాకశాస్త్రనిపుణుడు కావలెనని వారు చెప్పి నన్నువెళ్ళమన్నారు' అన్నాడు. నాకు పొట్ట చెక్కలయ్యేటంత నవ్వువచ్చింది. కాని ఐ. పి. యస్, చిన్నపుచ్చుకుంటాడని అపుకున్నాను, సరే! అయనతో "వంట మనిషి కావలసిన అవుసరమున్నది. ఐదురోజులు చేయవలసిన పిండి వంటలన్ని చెడగొట్టకుండా, నలుగురు తినడానికి రుచికరంగా ఉండేటట్లు తయారుచేయవలసి ఉంటుంది. రోజుకు మూడు రూపాయల చొప్పున యిస్తాను. ఎవరినైన ఏర్పాటుచేసిపెట్టండి" అన్నా. కాని ఆయనమాత్రము మొగము చిట్లించి "పంతులుగారూ! అల్లాటప్పా వంట వాళ్ళను నేను మీకుకుదర్చను. మీరు భలానా అని చెప్పకుండానే రకరకాల పిండి వంటలతో సహా స్వయంగా తయారుచేసి సప్లయిచేయగలవాడినే మీవద్దకు పంపుతాను, కాని మీరు రోజు కనీసము రు 10లు ఇవ్వాలి" అన్నాడు. గాభరాపడ్డాను రేటు చెప్పేటప్పటికి. వంటవాడికే 50 రూపాయలు ఇస్తే, ఇక పెండ్లి అయ్యేటప్పటికి వేసుకున్న అంచనాకు ఇబ్బడి అవుతుంది. చివఱకు గంటసేపు మాట్లాడుకొని రోజుకు రు5-ల చొప్పున రాజీపడ్డాము. ఆయన అడ్రస్సు తీసుకుందామని అడిగాను. తన పేరు, తండ్రిపేరు, ఇంటిపేరు, అడ్రస్సు చెప్పాడు. వెంటనే ఎందుకో కాకినాడ వాస్తవ్యుడును, నాబాల్యస్నేహితుడైన తుర్లపాటి రామారావు జ్ఞాపకం వచ్చాడు. అప్రయత్నంగా మీనాయనగారు ఖులాసాగా ఉన్నారా? అసలు మీ స్వగ్రామమేది? అని అడిగా. తన తాతతండ్రులది కాకినాడనియు, తన తండ్రి గుంటూరులో కాఫీహోటలు పెట్టాడనియు, అందులో నష్టమువచ్చిచివఱకు వంటలవాడుగా తయారైనాడనియు, ఆయన మరణించి నాలుగేండ్లయిందనియు తానుకూడ తండ్రి వృత్తినే పోనీకుండా జీవనాధారంగా పెట్టుకున్నాననియు చెప్పాడు.

'నేను పడ్డ ఆశ్చర్యమింతా అంతా కాదు. అబ్బాయి వెంకటేశన్, నీవు మావాడవే నీతండ్రి నేను స్నేహితులము. మేమిద్దఱము స్కూలుఫైనలువఱకు ఒకేక్లాసులో, ఒకే గదిలో ఉండి చదువుకున్నాము. నేను తరు"వాత కాలేజీకి వెళ్లాను. మీనాయనసంగతి యీమధ్య తెలియనేలేదు. పాపం! చనిపోయినాడా?" అని జాలిగా అన్నా. నన్ను జూచి అతను దిగాలుపడ్డాడు. ఎందుకిట్లా ఐ. సి. యస్. అని అచ్చువేయించుకున్నావని అడిగినాను.

"బాబుగారూ! I. C. S. అని పెట్టుకుంటానికి ఆక్షేపణ ఏమి ఉందండి? ఇండియన్ కుకింగుసర్వీసు (indian Cooking Service) మాది. ఈ బిరుదును సంపాదించడానికి వేలుఖర్చుపెట్టి B. A. M. A. చదివి ఇంగ్లడు పోనక్కఱలేదు. అధికారుల్కృప, తారతమ్యబుద్ధి ఆ గ్రహానుగ్రహములు మాకనవుసరము. మేమొకరి స్వాధీనములో అడుగుమడుగులొత్తవలసిన పనిలేదు. మాకున్నంత స్వాతంత్ర్యమెవరికీ లేదు. లేదు. ఒకరిని ఆశ్రయించము. అవుసరమున్నవాళ్ళే మా దగ్గఱికివస్తారు. మాకు ప్రతిఫలము నిర్ణయించ

డానికెవటికి హక్కులేదు. అడిగినంత యిస్తే అంగీకరించడం, లేనియెడల నిరాకరించడం: రెండేపద్ధతులు. ఎక్కువరాబట్ట డానికి సర్వీసు రికార్డుతో పనిలేదు. బ్లాకు మార్కుల భయములేదు. వృత్తికి భంగం కలుగకుండా మాహక్కులను కాపాడడానికి రెండోవాడి సిఫారసుకాని, ప్రత్యేకాధికారాలు కాని అక్కరలేదు. జ్యోతిషం చెప్పేవారు, శాండోలు, పెట్టుకున్నట్లు మేము ఇష్టముంటే ఒక నిండుసభలో, బహిరంగసభలో సామర్థ్యాన్ని నిర్ణయించి, ప్రసాదించకుండానే 'ప్రొఫెసరు' (Professor) అనే బిరుదునుకూడ పెట్టుకొనగలము. మాలో వర్ణవిభేధము అటంకంకాదు. ఏవరైనాసరే సంఘంలోచేరితే తర్ఫీదు చేస్తాము. తరువాత సంపాద్యమతని ఓపికను బట్టి, పరిశుభ్రతనుబట్టి, చాకచక్యాన్నిబట్టి హెచ్చు తగ్గులకు లోనౌతుంది. మాకు స్థలాంతర ప్రయాణాలు, యిష్టమౌతేనే తప్ప లేవు. అభివృద్ధికి రావడానికి ప్రత్యేకవేషధారణతో అవుసరములేదు. మాదొక పెద్ద సంస్థ (Associatio) అందులో యిప్పటికి 60 మంది మెంబర్లున్నారు. ప్రతివాడు రోజుకు సగటున 1 మొదలుకొని 5 రూపాయిలవలకు సంపాయించు కుంటున్నాడు. ఈ సంస్థనింకా అభివృద్ధికి తేదలచుకున్నాము. ప్రస్తుతము నేను అధ్యక్షుడనుగా ఎన్నుకోబడినాను. అధ్యక్షుడయిన వాడొక్కడే ఐ. సి. యస్. అనే బిరుదు పెట్టుకోడానికి అర్హుడని మొన్ననే మా వర్కింగు కమిటిలో ఏకగ్రీవంగా నిర్ణయింపబడింది. ఈ సంస్థకు ఆర్గనైజర్లు, ఏజంట్లు, సబ్ ఏజంట్లు కావలెనని మొన్నటి ఆదివారమునాడు పత్రికలో ప్రచురించినాను."

నాకు నువ్వువచ్చి, 'దీనికి ఏజెంట్లెందుకోయి?' అన్నా.

"అదేమిటండి, ఇవ్వాళ ఉండి రేపు మాయమయ్యే కంపెనీలు, పత్రికలు, ఏజంట్లు కావలెనని అచ్చువేయించి ఆర్భాటం చేస్తుంటే, స్థిరంగా ఉండబోయేది, శాశ్వతరాబడి వస్తుండేది అయిన మా సంస్థకు ఏజంట్లు ఎందుకంటారేమి? ఈ సంస్థ మీరేవింటారుగా యావద్భారత వ్యాప్తికలిగి పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తుంది నాలుగైదేండ్లలో. నిరక్షరాస్యులున్నారనుకున్నారా మెంబర్లలో, 60 మందిలో 28 మంది బి. ఏ. లు, 20 మంది యఫ్. ఏ. లు, 12 మంది మెట్రిక్యులేట్లు. ఇంకా అడ్మిషన్ కొఱకు వచ్చిన దరఖాస్తులు దాదాపు 44 ఉన్నవి. వాటిని విచారించి ఆర్డర్లువేయడానికి, రేపు 22 వ తారీఖున జనరల్‌బాడీ మీటింగు సమావేశపఱచనిర్ణయించుకున్నాను. వంటలు చేయడానికి ప్రెసిడెంటు వెళ్ళనక్కఱలేదు. అతని ఉత్తరువుల ప్రకారము మెంబర్లలో ఎవరో ఒకరు పంపబడును. కాని ప్రతి గొప్ప సంస్థయొక్క అధ్యక్షునికి ఉన్నట్లు, మా సంస్థ ప్రెసిడెంటుకుకూడ casting vote, special rights (పత్యేక హక్కులు) ఉన్నవి, ప్రత్యేక హక్కుల ననుసరించి యిష్టమయితే తానేవెళ్ళి ఆపని నిర్వహించవలసిన అవుసరమున్నాదనితోస్తే వంటచేయవచ్చు, కాని మామూలు మెంబర్లకన్న, అధ్యక్షునికి రేటు ఎక్కువ యివ్వాలి. ఎందుకంటారా? పనియొక్క అవుసరాన్ని బట్టి, బాధ్యతను బట్టి, వ్యక్తి గౌరవాన్ని బట్టి, extra యివ్వక తప్పదు, మఱి మీరు నా తండ్రి సమానులు. గనుక, మెంబర్లకిచ్చే ఫీజుకూడ (మొదట రాజీ కుదిరిన రు 5/-లు ప్రతిరోజు) తీసికొనకుండా అవుసరాన్ని గడుపుతా. ప్రత్యేక హక్కులుపయోగించే విషయంలో మా సంస్థ అధ్యక్షునికున్నంత నిరంకుశాధికారము ప్రపంచంలోని మఱే నియంతకును లేదు. అతని చర్యలను ఖండించడానికి మిగతా సభ్యుల కెవటికి హక్కులేదు. ఎవడైనా ఎదురు తిరిగినాడంటే అతనిమీద కొన్ని సంవత్సరాలకని కాదు, యావజ్జన్మము Disciplinary action (క్రమశిక్షణ చర్య) ఉపయోగింపబడుతుంది. కొన్ని సంవత్సరాలకనే అయితే వాడు చేసిన తిరుగుబాటుకు సరిపోయినంత శిక్ష కాదని మా నిశ్చితాభిప్రాయము. డబ్బు దస్కములేని మెంబర్లుకారుకనుక, మా సంస్థలోని ప్రతివాడు భయపడుతుంటాడు. వామదక్షిణపక్షాలరభసమాలోలేదు. అధ్యక్షుని మాటే వేదవాక్కు. మా సంస్థకు మంచి పురోభివృద్ధిగలదు. దివాలా తీయడానికి సిద్ధమౌతున్న ఇన్సూరెన్సు, ఎస్యూరెన్సు కంపెనీలను, మంచిస్థితిలో ఉన్నతక్కిన కంపెనీలెట్లా amalgamate (చేర్చుకుంటం) చేసుకుంటాయో, అట్లాగే రోజురోజు ఆదాయక్షీణము ప్రాప్తించుచున్న కాఫీహోటళ్ళను మా సంస్థలో చేర్చుకుంటానికి ప్లాను వర్కౌటు చేస్తున్నాము. త్వరలో మా ఆశయము నెరవేరగలదు. మా సంస్థకొక జాతీయగీతముగలదు. దానిని వింటూంటే వ్యక్తిపరంగా ఉన్నట్లుస్ఫురించినా, అది యావత్సంస్థకు వర్తింది.

"జయహే! జయజయహే, జయహే!
పాకశాస్త్రజ్ఞాన ధీనుతా!
రుచిరపదార్థ నిరాహకా!
భోక్త హృదయ తృప్తి కారకా!
జయహే! జయజయహే! జయహే!

ఇదే గాకుండ వ్యక్తి బిరుదములున్నవి. "గరిటె ధ్వజా!" "పాకశాస్త్ర విశారదా" "శీతళబిందె నిర్వాహకా" "నానావిధ ఫలహార నిర్మాతా" మొదలైనవి. అబ్బో! చెప్ప దలచుకుంటే అంతుపంతులేదు మా సంస్థనుగుఱించి. చాలసేపయింది మళ్ళీ కలుస్తా సాయంత్రము—సెలవు"

అని వెళ్లాడు వెంకటేశన్.

ఓరి పిడుగా! ఎంతవాడివైనావురా అనుకున్నా. అదేమి చిత్రమో కాని మేమందఱము వాడిని పేరుపెట్టి పిలవకుండా ఐ. సి. యస్. అని పిలవడమే అలవాటయింది. నిజంగా వాడే అదృష్టవంతుడు దమ్మిడీ ఖర్చు కాకుండా ఆ బిరుదాన్ని సంపాదించాడు—ఆక్షేపించేవాడెవడు వాడి ముందర.